తీగలు తొలగిస్తేనే ఇళ్ల నిర్మాణం

- ఇందిరమ్మ ఇళ్లకు భారంగా విద్యుత్ లైన్ల తొలగింపు
- నిధులు లేక నిలిచిన లైన్ల షిఫ్టింగ్
- తొలగించాలని నిరుపేదల వినతి

సారంగాపూర్: గత పదేళ్లలో ఇళ్లు మంజూరు కాక పోవడంతో చాలా మంది నిరుపేదలకు సొంతింటి కల కలగానే మిగిలింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇల్లు లేని వారు ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులకు చేసుకోవాలని సూచించింది. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో 11 వేల పైగా దరఖాస్తులు వచ్చాయి.


ఇళ్ల నిర్మాణానికి విద్యుత్ వైర్లతో సమస్యలు

➡ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ. 6 లక్షలు అందించాలని నిర్ణయించింది. ఇళ్లు మంజూరు కాగానే పనులు ప్రారంభించాలని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

➡ గతంలో వివిధ పథకాల కింద నిర్మించుకున్న గూనపెంకల (బెంగుళూరు గూన)ఇళ్లు బేస్‌మెంట్ నుంచి మూడున్నర మీటర్ల ఎత్తు వరకు ఉండేవి. దీంతో ఇళ్ల మీది నుంచి వెళ్లిన విద్యుత్ లైన్లు ఉన్నా పెద్ద సమస్య ఎదురు కాలేదు.

➡ ప్రస్తుతం చాలా మంది పేదలు, మధ్యతరగతి కుటుంబాలు తమకున్న కొద్దిపాటి భూమిలో పిల్లర్లతో ఇళ్లు నిర్మించుకోవడానికి సిద్ధమయ్యారు. బేస్‌మెంట్ నుంచి స్లాబ్‌వరకు 5 మీటర్ల ఎత్తు వస్తుంది. దీంతో తమ భూమిలో ఉన్న విద్యుత్ లైన్లు తొలగించాల్సి ఉంటుంది. ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించడం సమస్యగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లైన్లు తొలగించడానికి లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో విద్యుత్ శాఖకు నిర్ణయించిన రుసుము చెల్లించాలని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు. విద్యుత్ తీగల తొలగింపు తమకు ఆర్థికంగా భారమవుతుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


సారంగాపూర్‌లో ఇంటిపై తీగలు ఉండడంతో నిలిచిపోయిన ఇంటి నిర్మాణం


సారంగాపూర్‌లో ఇళ్ల పైనుంచి ఉన్న విద్యుత్ తీగలు

కానరాని లైన్స్ పాసింగ్ ఓవర్ హౌసెస్ స్కీం

గత ప్రభుత్వం 2022–2023లో పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఇళ్లపై ఉన్న విద్యుత్ లైన్లను మార్చడానికి లైన్స్ పాసింగ్ ఓవర్ హౌసెస్ పథకాన్ని ప్రారంభించింది. దీనికి ప్రజల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయకుండా ప్రభుత్వమే లైన్లను మార్చాలని నిర్ణయించింది. దీనికనుగుణంగా అధికారులు ప్రభుత్వానికి సర్వే చేసి నివేదిక పంపినా నిధులు విడుదల కాకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా తమ ఇళ్ల నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న విద్యుత్ తీగలను ప్రభుత్వం సరి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రభుత్వం నుంచి నిధులు వస్తే లైన్లు తొలగిస్తాం

ప్రభుత్వం లైన్స్ పాసింగ్ ఓవర్ హౌసెస్ పథకం కింద నిధులు విడుదల చేస్తే ఇళ్లపై నుంచి వెళ్లిన విద్యుత్ లైన్లను విద్యుత్ శాఖ మార్చడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఇళ్లపై నుంచి వెళ్లిన విద్యుతు లైన్ల విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– ప్రవీణ్, ట్రాన్స్‌కో ఏఈ

క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు


మాట్లాడుతున్న హేమంత్

జగిత్యాల: ఆరోగ్య పరిరక్షణతోనే విద్యలో రాణించవచ్చని ఐఎంఏ అధ్యక్షుడు హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంతో పాటు పలు పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలికలకు ఆరోగ్యంగా ఉండాలంటే రక్తహీనత సంబంధిత సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం బాలికలకు ఎనీమియా పరీక్షలు నిర్వహించారు. 79 మంది విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో ఐఎంఏ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ శ్రీలత, నాగరత్నం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెద్దచెరువు నింపాలని వినతి


డీటీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రాయికల్: పట్టణంలోని పెద్ద చెరువును ఎస్సారెస్పీ నీటితో నింపాలని మంగళవారం తురగ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో డెప్యూటీ తహసీల్దార్ గణేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎండలు ఉధృతమవుతున్న సమయంలో పట్టణ ప్రజలకు నీటి కష్టాలు రాకుండా ఉండేందుకు వెంటనే పెద్ద చెరువును ఎస్సారెస్పీ డీ–52 కెనాల్ నీటితో నింపాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుతారి తిరుపతి, ముత్యంరాజు, మహేశ్‌గౌడ్, గంగారెడ్డి, రాము, గోపి, పడాల గోపి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అధికారులు,రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: గ్రామాల్లో మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు భీమారం మండలం రాజలింగంపేట, ఒడ్యాడ్‌లో రూ 9.43 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం కోరుట్ల రూరల్ ఏడీఈ రఘుపతి ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఏఈలు అశోక్, భూమేశ్వర్, సబ్ ఇంజనీర్ హరిప్రసాద్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

పెగడపల్లి: వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు గొల్లపల్లి సబ్ డివిజనల్ ట్రాన్స్‌కో ఏడీఈ వరుణ్‌కుమార్ అన్నారు. పెగడపల్లిలో రెండు చోట్ల ఏర్పాటు చేసిన 100 కేవీ, 60 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమలో ఏఈ వెంకట్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ ఆయిల్‌పై విద్యార్థుల అవగాహన ర్యాలీ


ప్లకార్డులతో విద్యార్థుల ర్యాలీ

మెట్‌పల్లి: కల్తీ ఆయిల్ వినియోగించవద్దంటూ పట్టణంలోని విజడమ్ హైస్కూల్ విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ప్లకార్డులు ప్రదర్శిస్తూ పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కల్తీ నూనె కాదు.. నాణ్యమైన నూనెను ఎంచుకోండి అంటూ పలు నినాదాలు చేశారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని సింగిల్ విండో మాజీ చైర్మన్ అబ్బిడి రాజరెడ్డి, రైతులు కోరారు. మొక్కజొన్న పంట చేతికి వచ్చిందని, కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో రైతులు దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందని, వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మల్యాలలో మంగళవారం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ఏడాది కాలంలోనే 56 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని అన్నారు. అన్నివర్గాల సంక్షేమ కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆనంద రెడ్డి, ఆదిరెడ్డి, లక్ష్మారెడ్డి,బత్తిని శ్రీనివాస్,శనిగరం తిరుపతి,మ్యాక లక్ష్మణ్, ముత్యం శంకర్, హరినాథ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతివ్వాలి

కోరుట్ల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు మద్దతిచ్చి గెలిపించాలని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు, న్యాయవాదులను కలిసి కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు కాంగ్రెస్ అండగా నిలవాలని పీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజీత్‌రావు కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్‌తో పాటు నాయకులు వాకిటి సత్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్‌లో నాయకుల ప్రచారం

కథలాపూర్: మండలంలోని పోసానిపేట, పోతారం గ్రామాల్లో పీసీసీ కార్యవర్గసభ్యుడు తొట్ల అంజయ్య కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, మట్టగజపు నర్సయ్య, ఆకుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా ప్రచారం


వేములకుర్తిలో ప్రచారం చేస్తున్న పట్టభద్రులు

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని మంగళవారం వివిధ పార్టీల నాయకులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు.ఎర్దండి, మూలరాంపూర్, బర్తీపూర్, వేములకుర్తి గ్రామాల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా, మండలంలోని వర్షకొండ గ్రామంలో ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా వేర్వేరుగా పట్టభద్రుల ఇండ్లకు వెళ్ళి కరపత్రాలను పంచారు. తమ అభ్యర్థులను గెలిపించాలని విన్నవించారు.

ప్రశ్నించేవారికి ప్రాధాన్యత ఇవ్వాలి

కథలాపూర్: ప్రభుత్వాన్ని సమస్యలపై ప్రశ్నించే వారికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం హరీశ్‌గౌడ్ కోరారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి మంద జ్యోతి తరుపున ప్రచారం చేశారు.

పన్నులు చెల్లించని వారికి రెడ్ నోటీసులు


పన్నులు వసూలు చేస్తున్న కమిషనర్

ధర్మపురి: ఆస్తి పన్నులు చెల్లించని ఇళ్ల యజమానులకు రెడ్ నోటీసులు జారీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు.పట్టణంలోని పలు చోట్ల సిబ్బందితో కలిసి పన్నుల వసూలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ ధర్మపురి పట్టణంలోని 15 వార్డుల్లో సిబ్బంది ఇంటింటా తిరుగుతూ పన్నులు వసూలు చేస్తున్నారని, కానీ చాలామంది స్పందించడం లేదని, వారికి రెండు సార్లు నోటీసులు జారీ చేశామని, మార్చి 31లోగా చెల్లించకుంటే రెడ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్‌కు 1.33 కోట్ల బకాయిలు రావాల్సి ఉండగా, రూ.50 లక్షల వరకు వసూలయ్యాయని పేర్కొన్నారు. మార్చి 31 లోగా మొత్తం బకాయిలు వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి గంగాధర్, గోవింద్, బిల్ కలెక్టర్ తదితరులున్నారు.

విద్యార్థుల వీడ్కోలు వేడుక


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మల్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోతె శివరామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికతో ముందుకెళ్లాలి


ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

జగిత్యాల: విద్యార్థులు ప్రణాళికతో ముందుకెళ్లాలని రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ అన్నారు. మంగళవారం డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో అనుకున్నది సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ నరేశ్, ప్రిన్సిపాల్ మునీందర్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

గుండుపిన్నుపై శివయ్య, నందీశ్వరుడు



జగిత్యాలటౌన్: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జగిత్యాలకు చెందిన సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్ గుండుపిన్నుపై పరమశివుడు నందీశ్వరుని సూక్ష్మ కళారూపాలను అద్భుతంగా రూపొందించి తన భక్తిని చాటుకున్నాడు. సుమారు పన్నెండు గంటలు శ్రమించి గుండు పిన్నుపై నైలాన్, పెన్సిల్ కలర్స్ ఉపయోగించి ఈ చిత్రాన్ని తయారు చేసినట్లు దయాకర్ తెలిపారు.

శ్రీకనక సోమేశ్వర స్వామిని దర్శించుకున్న డీఎస్పీ

మల్లాపూర్: మండల కేంద్రంలోని శ్రీ కనక సోమేశ్వరుడిని మంగళవారం మెట్‌పల్లి డీఎస్పీ రాములు దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలుచేరు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రభాకర్‌శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం, సభ్యులు డీఎస్పీని సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సోమేశ్వర కొండపైకి తరలిన స్వాములు

సోమేశ్వర(శివ) దీక్షస్వాములు మంగళవారం సోమేశ్వర కొండపైకి తరలివెళ్లారు. మండల,అర్ధ మండల దీక్షలు చేపట్టిన స్వాములకు శ్రీ కనకసోమేశ్వర ఆలయ ప్రధానార్చకులు బల్యాపెల్లి ప్రభాకర్ శర్మ ప్రత్యేక పూజలు చేసి ఇరుముడులు కట్టారు. అనంతరం గ్రామ పురవీధుల గుండా తమ కుటుంబసభ్యులతో సోమేశ్వర సంకీర్తనలు, భజన గీతాలను ఆలపిస్తూ ర్యాలీగా కొండపైకి తరలివెళ్లారు. శివరాత్రి రోజు దీక్షను విరమిస్తారు.

ఉత్సవ విగ్రహాల బహూకరణ

వెల్గటూర్ : ఎండపల్లి మండలం కొత్తపేటలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శివకల్యాణం జరిపించేందుకు గాను జీఎంఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు జీరెడ్డి అనూష–మహేందర్‌రెడ్డి దంపతులు తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆలయానికి శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను బహూకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు మహేందర్‌రెడ్డి దంపతులను అభినందించారు.

శివరాత్రి వేడుకల్లో జీవన్‌రెడ్డి


పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జగిత్యాల పట్టణంలోని పురాణిపేట అభయాంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కాలం చెల్లిన బీర్ల విక్రయాలపై ఆరా!

సాక్షి స్పందన

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లోని ఓ వైన్స్‌లో ఎక్సైజ్ అధికారులు మంగళవారం తనిఖీ చేపట్టారు. వైన్స్‌లో కాలం చెల్లిన బీర్లు విక్రయిస్తున్నట్లు గ్రామానికి చెందిన పలువురు 'సాక్షి' దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై 'కాలం చెల్లిన బీర్ల విక్రయాలు' శీర్షికన సోమవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ స్థానిక ఎక్సైజ్ అధికారులను ఆరా తీశారు. సంబంధిత వైన్స్ దుకాణంలో తనిఖీ చేయాలని ఆదేశించారు. దీంతో సోమవారం రాత్రి వైన్స్‌కు వెళ్లిన అధికారులు తనిఖీ చేసి, అందులో స్టాక్ ఎంత ఉంది? ఉన్న వాటి కాలపరిమితి ఎంత..? కాలం చెల్లినవి ఏమైనా ఉన్నాయా? లేదా? అనే వివరాలు నమోదు చేసుకున్నారు. తనిఖీలో గుర్తించిన విషయాలకు సంబంధించిన నివేదికను సూపరింటెండెంట్‌కు సమర్పించారు.

మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు


జగిత్యాలలోని మడేలేశ్వర ఆలయం


సంగెం శివాలయం

జగిత్యాలటౌన్/ కోరుట్ల రూరల్/ రాయికల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జగిత్యాల పట్టణం, కోరుట్ల మండలం, రాయికల్‌లోని పలు ఆలయాలు శివరాత్రి వేడుకలకు ముస్తాబ య్యాయి. జగిత్యాల పట్టణంలోని మార్కండేయ ఆలయం, పలు ఆలయాలు రాయికల్‌లోని చెన్నకేశవనాథ ఆలయం, మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాలు, కోరుట్ల మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాల్లో ఉత్సవాలు జరగనున్నాయి. వేడుకల్లో ప్రత్యేకపూజలు, అర్చనలు అభిషేకాలు, శివ పార్వతుల కల్యాణం, భక్తులకు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళలు

మెట్‌పల్లి: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం కల్యాణోత్సవాలను ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేసి, 30 మంది జంటలతో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు దురిశెట్టి నటరాజ్, ఇందూరి గిరిధర్, వంగల మహేష్, కోటగిరి తిరుమల్, శ్రీరామోజు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమ పూజ

పెగడపల్లి: మండల కేంద్రంతో పాటు, వెంగళాయిపేటలోని శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం అగ్రిప్రతిష్ఠ స్థాపిత దేవతా హవనములు, రుద్ర హవనములు, లలిత విష్ణు సహస్ర పారాయణం, కుంకుమ పూజలు తీర్థప్రసాద వితరణ తదితర ప్రత్యేక పూజలు అర్చకులు గుండి శ్రీనివాస్‌శర్మ, రాజేశ్వరశర్మ, వినయ్‌శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోపేతంగా జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శివ స్వాములు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మాయిలకు అండగా ఉంటాం


అమ్మాయిలతో మాట్లాడుతున్న నర్సింగరావు

కోరుట్ల: తల్లిదండ్రులను కోల్పోయిను అమ్మాయిలకు అండగా ఉంటామని కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. అయిలాపూర్‌కు చెందిన అల్వాల గంగాధర్–జల దంపతులు అనారోగ్యంతో మూడు నెలల వ్యవధిలో మృతి చెందారు. వీరికి ముగ్గురు అమ్మాయిలు కాగా, ఒకరికి వివాహం జరిగింది. మిగిలిన దీప్తిక (18), సుకన్య(16)లు అనాథలయ్యారు. వీరికి సొంత ఇల్లు లేక బంధువుల ఇంట్లో నివాసముంటున్నారు. కోరుట్ల ప్రెస్‌క్లబ్ నుంచి ఇచ్చిన క్వింటాల్ బియ్యాన్ని జువ్వాడి నర్సింగరావు మంగళవారం వారికి అందజేశారు. అమ్మాయిల చదువు కోసం అయ్యే ఖర్చు మొత్తం తానే భరిస్తానని తెలిపారు. వీరికి ఇందిరమ్మ ఇల్లుతో పాటు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తామన్నారు. తక్షణ సాయంగా రూ. 5వేలు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి, నాయకులు కొంతం రాజం, నగునూరి గంగాధర్, సత్యనారాయణ, రాధాకృష్ణ, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ముక్కెర చంద్రశేఖర్, ఆకుల మల్లికార్జున్, పాత్రికేయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సైన్స్ డే వేడుకలు


కథలాపూర్‌లో విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంఈవో, ఏవో

కథలాపూర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం ముందస్తుగా సైన్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ప్రయోగాలు తయారు చేసి ప్రదర్శించారు. ప్రయోగాల పనితీరును సందర్శకులకు వివరించారు. మంచిగా ప్రయోగాలు చేసిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, ఏవో యోగిత, హెచ్‌ఎం కమలాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడిపల్లి: మండలంలోని మోడల్ (ఆదర్శ)పాఠశాలలో ప్రిన్సిపల్ నాగ సుధారాణి ఆధ్వర్యంలో ముందస్తు సైన్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను, మోడళ్లను ప్రదర్శించారు. క్విజ్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తపై అవగాహన

కోరుట్ల: పట్టణంలోని పలు వార్డులు, బాలికల ఉన్నత పాఠశాలలో తడి, పొడి చెత్త, హానికరమైన చెత్తపై మున్సిపల్ కమిషనర్ తిరుపతి మంగళవారం అవగాహన కల్పించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను వాడొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, అధికారులు మహేశ్, మదు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్

కథలాపూర్: మండలంలోని సిరికొండ, దూలూర్ గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ వినోద్ మంగళవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో తనిఖీలు చేపట్టగా సిరికొండలో 20 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక, దూలూర్‌లో 15 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక నిల్వలు కనిపించాయన్నారు. వాటిని సీజ్ చేసి వేలం పాట ద్వారా నీటిపారుదలశాఖ అధికారులకు అప్పగించామన్నారు. తనిఖీల్లో ఆర్ఐ నగేశ్ ఉన్నారు.

28న ఇసుక డంప్ వేలం

మల్లాపూర్: మండలంలోని వీవీరావుపేటలో రెవెన్యూ అధికారులు పట్టుకున్న ఇసుకడంప్‌కు ఈ నెల 28న వేలం పాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గలవారు పాల్గొనాలని పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శిగా బాజన్న

కోరుట్ల: జాతీయ బీసీ సంక్షేమ సంఘం కోరుట్ల డివిజన్ ప్రధాన కార్యదర్శిగా బాజన్న నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు జాజాల శ్రీనివాస్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాండభేరి నరేశ్ ఆదేశాలతో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లా వెంకటేశ్వర్లు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారికి బాజన్న కృతజ్ఞతలు తెలిపారు.

మెట్‌పల్లి మండల అధ్యక్షుడిగా దేవేందర్

మెట్‌పల్లి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మెట్‌పల్లి మండల అధ్యక్షుడిగా చింతకుంట దేవేందర్, డివిజన్ ప్రధాన కార్యదర్శిగా మర్రి నంద కిషోర్‌లను నియమించారు. ఈ మేరకు మంగళవారం నియామక పత్రాలను రాష్ట్ర కార్యదర్శి బొమ్మెల శంకర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్ల వెంకటేశ్వర్లు, బీసీ నాయకులు పాల్గొన్నారు.